సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కామర్స్ అధ్యాపకులు

భీమునిపట్నం: విద్యార్థులందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ బి.సహదేవుడు సూచించారు. కళాశాల వద్ద కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల లావాదేవీలు, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వినియోగం మొదలైన వాటి గురించి తెలుసుకోవాలని, ఇది ఎంతో అవసరమని అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న శాస్త్రి

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ నెహ్రూ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను జిల్లా మధ్యాహ్న భోజన పథకం కో–ఆర్డినేటర్ జె.శాస్త్రి శుక్రవారం పరిశీలించారు. భోజనం ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న పదార్థాలను పరిశీంచారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ నిర్వహణ బాగుందని, దీని ఇలాగే కొనసాగించాలని సూచించారు. విద్యార్థి లందరూ పాఠశాలలోనే భోజనం చేసే విధంగా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగోతి సింగన్నకు నివాళి

మధురవాడ: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు నాగోతి సింగన్న వర్ధంతిని పురస్కరించుకుని మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్.ఎస్.నాయుడు, అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, క్వారీ సొసైటీ కార్యదర్శి వాండ్రాసి రవికుమార్, పౌర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోగి కుటుంబానికి సాయం

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు వెంకటేశ్వరమెట్టకు చెందిన వడ్డి శ్రీను అనే వ్యక్తి కొంత కాలంగా బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. విషయం తెలిసిన సాయిరవీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, శివశంకర్ శుక్రవారం శ్రీను మందులకు ఆర్థిక సాయంతో పాటు కుటుంబ సభ్యులకు బియ్యం, నిత్యావసర సరకులను అందించారు. శ్రీను కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని నెలకు, అతనికి వైద్య ఖర్చుల నిమిత్తమే రూ.10 వేల వరకు ఖర్చు అవుతోందని తెలిపారు. దాతలు ఆదుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ తుక్కు వ్యాపారి అదృశ్యం



రాజశేఖరరెడ్డి (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకికి చెందిన ముక్కామల రాజశేఖరరెడ్డి శుక్రవారం అదృశ్యమయ్యారు. ఉదయం షాపునకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆయన మళ్లీ కనిపించలేదు. వివరాలివి.. ప్లాస్టిక్ తుక్కు వ్యాపారం చేస్తున్న రాజశేఖరరెడ్డి ఇటీవల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం షాపునకు వెళ్లే ముందు భార్య రాజ్యలక్ష్మికి ధైర్యం చెబుతూ నీకు భయంగా ఉంటే అన్నదమ్ములను, బంధువులను తోడుగా తెచ్చుకోవాలని సూచించాడు. భర్త కొత్తగా మాట్లాడటం గమనించిన రాజ్యలక్ష్మి తర్వాత షాపునకు వెళ్లి చూడగా అక్కడ భర్త లేరు. దీంతో ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆహ్లాదం ఆనందం

పరమకున్న పచ్చదనం.. చెరువు సమీపంలో చెట్ల నుంచి వీచే చల్లని గాలి.. ఆహ్లాదకర వాతావరణం, పిల్లలు ఆడుకునేందుకు క్రీడాపరికరాలు, చెరువు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్, పెద్దల కోసం వాకింగ్ ట్రాక్.. రాత్రి అయినా చిన్నారులు సరదాగా ఆడుకునేలా విద్యుత్ దీప కాంతులతో జమ్మిచెరువు పార్కు సందర్శకులను ఆకట్టుకుంటోంది. పార్కు అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలు కేటాయించడంతో పార్కు రూపురేఖలే మారిపోయాయి.





ఆధునీకరించిన జమ్మిచెరువు పార్కు



పార్కులో వాకింగ్ ట్రాక్

- జమ్మిచెరువు పార్కుకు మహర్దశ
- గత ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షల కేటాయింపు
- తొలివిడత రూ.40 లక్షల పనులు పూర్తి
- త్వరలో మలివిడత పనులు ప్రారంభం

భీమునిపట్నం: జమ్మిచెరువుకు మహర్దశ పట్టింది. తగరపువలస రోడ్డులోని ఈ పార్కు అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో అందంగా, ఆహ్లాదకరంగా రూపొందింది. తొలివిడతగా రూ.40 లక్షలతో పనులు చేయగా, మలివిడత పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

మారిన రూపురేఖలు

గతంలో ఇక్కడ జమ్మిచెరువు చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో పాటు వాకింగ్ ట్రాక్ కూడా సరిగ్గా ఉండేది కాదు. ముఖ్యంగా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు ఎక్కువ మంది వస్తుంటారు. కానీ, ఇక్కడ లైట్లు లేకపోవడంతో ఎక్కువ సేపు ఉండలేక నిరాశతో వెళ్లిపోయేవారు. ఈ పరిస్థితుల్లో పార్కు అభివృద్ధికి రూ. 80లక్షలు కేటాయించారు. అందులో భాగంగా తొలివిడతగా రూ. 40లక్షలతో సుందరీకరణ పనులను చకచకా చేశారు. ముందుగా ఇక్కడ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి చెరువు చుట్టూ పటిష్టమైన కంచెను ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను చక్కగా రూపొందించారు. పార్కు మొత్తం లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పార్కు రూపురేఖలు ఎంతో సుందరంగా మారిపోయాయి. రోజు ఉదయం, సాయంత్రం పెద్ద సంఖ్యలో వాకర్స్ వాకింగ్‌కు వస్తున్నారు. ఇక సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో పిల్లలు, పెద్దలు రావడంతో పాటు లైటింగ్ ఉండడంతో తమకు నచ్చినంత సేపు సరదాగా గడిపి వెళుతున్నారు.

మరో రూ.40లక్షలతో పనులు

గతంలో మంజూరైన నిధుల్లో మిగిలిన మరో రూ.40లక్షలతో ఇప్పుడు మరిన్ని పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సెల్ఫీలు తీసుకోవడానికి మూడు అందమైన పాయింట్లు, గౌతమ బుద్ధుని విగ్రహం, జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకునే పరికరాలు మొదలైనవి త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే పార్కు మరింత ఆకర్షణీయంగా మారనుంది.



ఏర్పాటు చేయనున్న సెల్ఫీ పాయింట్ నమూనా



లైటింగ్‌లో పార్కు



వాకింగ్‌కు ఎంతో అనువుగా ఉంది

ఈ పార్కును అభివృద్ధి చేసిన తరువాత ఎంతో బాగుంది. గతంలో బయట వాకింగ్ చేయడం ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు చక్కని వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో ఆహ్లాదకర వాతావరణంలో వాక్ చేస్తున్నాం. సేద తీరడానికి ఎక్కడికక్కడ బెంచీలు కూడా ఉండటంతో, ఎంతో సదుపాయంగా ఉంది.

– వై. వెంకటరావు, వాకర్, భీమిలి



పిల్లలతో ఎంతసేపైనా ఉండగలుగుతున్నాం

జమ్మిచెరువు పార్కుకు పిల్లలతో సాయంత్రం వస్తుంటాం. గతంలో లైట్లు లేకపోవడంతో ఎక్కువ సేపు ఉండే అవకాశం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పార్కు మొత్తం చక్కగా లైటింగ్ ఏర్పాటు చేయడంతో కావలసినంత సేపు ఉంటున్నాం. పిల్లలు సరదాగా ఆడుకుంటున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఉండటంతో భయం కూడా లేదు.

– లచ్చుబోతు చంద్రకళ, భీమిలి



త్వరలో పనులు ప్రారంభిస్తాం

జమ్మిచెరువు పార్కులో చేయవలసిన పనులు మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తాం. నమూనాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే పార్కు మరింత ఆకర్షణీయంగా మారుతుంది.

– సురేష్, జోనల్ ఏఈ

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని నేత్రపర్వంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

బయోమెడికల్ రంగంలో

ఉజ్వల భవిష్యత్తు

కొమ్మాది: దేశంలోని వైద్య ఆరోగ్య రంగాలకు అవసరమైన బయో మెడికల్ ఉత్పత్తుల రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐఐటీ మద్రాస్ బయో మెడికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ బి.ఎస్.వి. ప్రసాద్ పట్నాయక్ అన్నారు. 'బయో మెడికల్ ఇంజినీరింగ్– భారత్‌లో అవకాశాలు' అంశంపై గీతం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్య రంగానికి అవసరమైన పరికరాలను దేశీయంగా ఉత్పత్తి చేయకపోవడంతో చాలా కాలం విదేశాల నుంచి అధిక వ్యయంతో దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. హృద్రోగులకు ఉపయోగించే కృత్రిమ కవాటాలు, బయోమెడికల్ ఉత్పత్తులను అధిక వ్యయంతో కొనుగోలు చేయడాన్ని నివారించడానికి మెడ్‌టెక్ జోన్ ద్వారా దేశీయంగా పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉందన్నారు.

రెండు గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాల్లో 1650 పశువులకు పశు వైద్య సిబ్బంది నట్టల వ్యాధి నివారణ మందులు పట్టారు. ఐనాడలో 1124 పశువులకు సేవలందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు పాల్గొన్నారు. కృష్ణాపురంలో 506 పశువులకు పశు వైద్యాధికారి మహేష్ కుమార్ నట్టల వ్యాధి నివారణ మందులు పట్టారు. కార్యక్రమంలో నాయకులు మొకర అప్పలనాయుడు, బొడ్డు శ్రీను, మొకర శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి చాగంటి ప్రవచనాలు

మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న చాగంటి కుమారుడు షణ్ముఖ చరణ్, చిత్రంలో సోమరాజు, సత్యనారాయణ

మధురవాడ: సంపూర్ణ రామాయణంపై ప్రముఖ ప్రవచన కర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి 6వ తేదీ వరకు 42 రోజులు ఈ ప్రవచనాలు ఉంటాయని ఆయన కుమారుడు షణ్ముఖ చరణ్, గాయత్రీ విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు, అష్టలక్ష్మి ఆలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ వెల్లడించారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రవచనాల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. వాల్మీకి రామాయణంలో ఆరు ఖండాలను, ఒక్కో ఖండంపై వారం రోజుల పాటు చాగంటి ప్రవచిస్తారని వివరించారు. శ్రీ అష్టలక్ష్మి, వైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రీ విద్యా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్మవర్ధిని సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని, సుందరాకాండ, సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం తదితర ముఖ్య ఘట్టాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించిన రామయంత్రం ఇప్పటికే ఇక్కడికి చేరుకుందని, ప్రవచనాలతో పాటు రామయంత్రం దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. గాయత్రీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ జి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు, పార్కు పరిశుభ్రతకు దివీస్ సహకారం



చెరువు, పార్కు పరిశుభ్రత పనులు పరిశీలిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస పోలమాంబ అమ్మవారి చెరువు, పార్కు పరిశుభ్రత పనుల నిమిత్తం భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ శుక్రవారం రూ.2.50 లక్షలు నిధులు విడుదల చేసింది. ఈ పనులను భీమిలి జెడ్సీ పి.ప్రేమ ప్రసన్నవాణి పరిశీలించారు. చిల్డ్రన్స్ పార్కు, హెల్త్ పార్కు, వాకింగ్ ట్రాక్ తదితర మరమ్మతులకు, పరిశుభ్రతకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. సంస్థ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ దివీస్ లేబొరేటరీ రూ.2.25 కోట్లతో పార్కును అభివృద్ధి చేస్తే సరైన నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయన్నారు. జీవీఎంసీ దృష్టి సారించి, పార్కు పరిసరాలలో కాపలా ఏర్పాటు చేయాలని, ఆస్తులు రక్షించాలని కోరారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పిలకవానిపాలెంలో నాగుపాము కలకలం



నూతిలో తేలియాడుతున్న నాగుపాము



పామును లాఘవంగా సంచిలోకి పంపిస్తున్న స్నేక్ క్యాచర్ మధు

పీఎం పాలెం: పిలకవానిపాలెంలో ఓ నాగుపాము శుక్రవారం కలకలం రేపింది. పట్టపగలు జనారణ్యంలో అటూ ఇటూ పాకడంతో స్థానికులు భయాందోళనకు గురై, పరుగులు తీశారు. తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో పిలకవానిపాలెంలోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న నూతిలోకి సర్పం దూకింది. వెంటనే స్థానికులు నగరంలోని ఈస్టర్న్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీకి సమాచారం అందించడంతో, సంస్థ ప్రతినిధి పి. మధు సంఘటన స్థలానికి వచ్చి నూతిలో తేలియాడుతున్న నాగుపామును లాఘవంగా బయటకు తీశారు. సుమారు 5 అడుగుల పొడవు ఉన్న సర్పాన్ని ఓ సంచిలో బంధించి, కంబాలకొండ అభయారణ్యంలో విడిచిపెట్టారు.


కుక్కల దాడిలో 8 మేకల మృతి



మృతి చెందిన మేకలు

కొమ్మాది: కుక్కల దాడిలో 8 మేకలు మృతి చెందాయి. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో ఎర్ర అప్పారావు పెంచుకుంటున్న 8 మేకలపై గురువారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేయడంతో, అవి మృతి చెందాయి. దీంతో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని అప్పారావు తెలిపారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని,అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోనందు వల్లనే తమ మేకలు మృతి చెందాయని వాపోయారు.అధికారులు స్పందించి, కుక్కల బెడద నుంచి చిన్నారులకు, మూగ జీవాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

తెల్లవారినా తొలగని మంచుతెర



మంచు దుప్పటిలో భీమిలి లైట్‌హౌస్

పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయాన్ని కమ్మేసిన మంచు

మంచు కమ్మేసిన భీమిలి మెయిన్ రోడ్డు

లైట్‌హౌస్ వెనుక బీచ్ రోడ్డు ఇలా..

భీమిలిని శుక్రవారం మంచు దుప్పటి కప్పేసింది. పద్మనాభం మండలంలోని పలు గ్రామాల్లో మంచు వర్షంలా కురిసింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు ఇదే పరిస్థితి. కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, కురిపల్లి, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, తునివలస, చిన్నాపురం గ్రామాల్లో పంట పొలాలు కనిపించని విధంగా మంచు ఆవరించింది. కుంతీ మాధవ స్వామి ఆలయం, విజయనగరం–శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై, పద్మనాభం బ్రిడ్జిపై మంచు ముసుగేసింది. దీంతో వాహన డ్రైవర్లు ఉదయం తొమ్మిది గంటల వరకు లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. భీమిలి బీచ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, లైట్ హౌస్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

– భీమునిపట్నం/పద్మనాభం

విద్యతోనే బాలికల సాధికారత



చిట్టివలస డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

తగరపువలస: మహిళలు తమ జీవితంలో వివిధ రకాల వివక్ష, దోపిడీ నుంచి బయట పడాలంటే వారికి విద్య అవసరమని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 'ఎంపవరింగ్ గర్ల్స్ .. ఎంపవరింగ్ ఇండియా' నినాదంతో శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి తదతరులు బాలికా విద్య ప్రాధాన్యతను వివరించారు. బొబ్బిలి యుద్ధం పూర్తయి 268 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దాని గురించి వివరించారు. 1757 జనవరి 24న బొబ్బిలి రాజుల సైన్యానికి విజయనగరం, ఫ్రెంచ్ ఉమ్మడి సైన్యానికి మధ్య వీరోచిత పోరాటం జరిగిందన్నారు. ఈ యుద్ధంలో తాండ్ర పాపారాయుడు వీరమరణం పొందారని వివరించారు.

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎస్ఎస్ఏ డైరెక్టర్ నాగేశ్వరరావు నుంచి పురస్కారం అందుకుంటున్న ఆరిపాక విద్యార్థులు

భీమునిపట్నం/సబ్బవరం: విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో ఉమ్మడి విశాఖకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. డిజిటల్ కళాశాల కేటగిరీలో పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.చరణ్‌రాజ్, రంగోలి పోటీల్లో భీమిలి కేజీబీవీకి చెందిన కె.ఉమాదేవి, కె.జ్యోత్స్న, స్లోగన్ రైటింగ్ పోటీలో పద్మనాభం కేజీబీవీకి చెందిన కె.సుప్రియ, రోల్‌ప్లే పోటీలో సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఆరిపాక ఆంగ్ల ఉపాధ్యాయురాలు బి.వి.రామలక్ష్మి రచించిన 'భువన విజయం' నాటకాన్ని 9వ తరగతి విద్యార్థినులు ఎ.ఉమాదేవి, జె.దివ్యధరణి, పి.హిందువదన చక్కగా ప్రదర్శించారు. సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా విజేతలు పురస్కారం, ప్రశంసాపత్రం స్వీకరించారు. విజేతలను భీమిలి జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ జ్యోతికుమారి అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఐ వెంకటేశ్వరరావు

కొమ్మాది: సమాజంలో ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, వాటిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. దిశ ఏసీపీ పెంటారావు ఆదేశాల మేరకు 8వ వార్డు ఎండాడలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్లో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు అధికంగా ఉన్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.